గుత్తేదారులకు రూ.14.67కోట్లు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

కౌన్సిల్ ఎజెండాను చదువుతున్న సీనియర్ అసిస్టెంట్ శంకర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నవంబర్ 8 : మహబూబ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది.మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి పలువురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ప్రవేశపెట్టిన పలు అంశాల అజెండాకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపాలిటీ పరిధిలో స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ ఏజెన్సీ పనితీరు, సిబ్బంది నియామకం, గతంలో రూ.వందకోట్ల నిధుల ఎలక్ట్రీషియన్ పనితీరు, నియామక అంశాలపై మాత్రం కొద్దిపాటి చర్చ జరిగింది. ఎవరికీ ఇబ్బంది లేకుండా చూస్తామని చైర్మన్ హామీతో చర్చ ముగిసింది. 76 రకాల పనులకు రూ.14.67 కోట్లు సాధారణ నిధుల కింద కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సర్వే నం.380/1లో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు, మున్సిపల్ విజయ తెలంగాణ డెయిరీ పార్లర్ ఏర్పాటుకు దుకాణం కేటాయింపు, వార్డు నం.39లో అభివృద్ధి పనులకు బిల్లులు రూ.1.20కోట్లు సాధారణ నిధుల నుంచి కేటాయించేందుకు తీర్మానించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్ ఛార్టులు ఏర్పాటు చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ అచ్చగట్ల అంజయ్య తెలిపారు. పట్టణంలోని 35వ వార్డు కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సిములు బడ్జెట్ పెట్టలేదని కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అలాగే రాత్రి ఫోన్ చేసి ఉదయమే కౌన్సిల్ సమావేశమంటే ఎట్లాగని 18వ వార్డు కౌన్సిలర్ కిశోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని 7వ వార్డు కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి కోరారు. స్ట్రీట్‌లైట్ల నిర్వహణ ఏజెన్సీ పనితీరు ఏమాత్రం బాగాలేదని 32వ వార్డు కౌన్సిలర్ సదాతుల్లా అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విలీన గ్రామాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులను కోరారు.

ఎట్టకేలకు కొత్త భవనంలోకి..

అద్దె భవనం నుంచి నూతన భవనానికి వస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దామరగిద్ద, నవంబర్ 8 : మండలకేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలను ఎట్టకేలకు నూతన భవనంలోకి మార్చారు. గత నెల 18వ తేదీన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'నడిరోడ్డుపై పాఠాలు' కథనానికి అధికారులు చాలా రోజులకు స్పందించారు. నూతన పాఠశాల నిర్మాణానికి కేసీఆర్ సర్కారు నిధులు మంజూరు చేయడంతోపాటు దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నెమ్మదించాయి. నాలుగు నెలల కిందట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాఠశాలను ప్రారంభించినప్పటికీ చిన్నారులకు వాష్‌రూంలు లేకపోవడంతో పురాతన అద్దె భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పాత భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలను నడిరోడ్డుపై చెబుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఎంఈవో కృష్ణారెడ్డి శుక్రవారం పాఠశాలను కొత్తభవనంలోకి మార్చి ప్రారంభించారు. అయితే, విద్యార్థినులకు వాష్‌రూమ్స్ లేనందునా తిప్పలు మాత్రం తప్పడం లేదు.

భయం గుప్పిట్లో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రం బయట నిల్చున్న చిన్నారులు

మరికల్, నవంబర్ 8 : మండలంలోని బుడ్డెగానితండాలో అంగన్‌వాడీ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తండాలో ఇండ్లు కిరాయికి లేక పోవడంతో మట్టిమిద్దెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి కింద పడుతున్నది. దీంతో చిన్నారులను అంగన్‌వాడీకి పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీ వాకిటి మల్లేష్, తండ్రి: శ్రీ గోకరప్ప (**ఖాతా నెం. 947తో పట్టా పాస్‌బుక్ నెం. T01180290441**)కు చెందిన, చిట్యాల గ్రామం, మక్తల్ మండలం, నారాయణపేట జిల్లా వద్దగల సర్వే నెం. 70/A/1లో ఎక. 4.12 గుంటల విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తును నా క్లయింట్ కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తున్నారు. ఎవరికైనా ఏదేనిఅభ్యంతరం / టైటిల్ / క్లెయిమ్ / ప్రయోజనం కలిగి ఉన్నచో వారు అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా 7 రోజులలోగా దిగువ సంతకందారును సంప్రదించవచ్చును. ఎలాంటి అభ్యంతరాలు అందనిచో నా క్లయింట్ సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌తో ముందుకు సాగుతారు మరియు ఆ తరువాత ఎలాంటి క్లెయిమ్‌లు అనుమతించబడవు.

దేవకర్.పి, అడ్వకేట్
ప్లాట్ నెం. 180/P, త్రిమూర్తి కాలనీ,
రోడ్ నెం. 4, మహేంద్ర హిల్స్,
సికింద్రాబాద్-500 026,
మొబైల్ నెం. 9849025380.

సమగ్రంగా నమోదు చేయాలి

- కలెక్టర్ విజయేందిరబోయి

రాజేంద్రనగర్‌లో ఎన్యూమరేటర్లకు సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నవంబర్ 8 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబం వివరాలు సేకరించాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులు, సిబ్బందికి సూచించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ మోతీనగర్, శెట్టి కాంప్లెక్స్, రాజేంద్రనగర్‌తోపాటు హన్వాడ మండలంలోని పలు ప్రాంతాల్లో సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ఇండ్ల జాబితా తయారీ, స్టిక్కరింగ్ ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇండ్ల జాబితా తయారీ, స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తయినందునా ఈనెల 9నుంచి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎన్యుమరేటర్లు సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. సర్వే వివరాలు గోప్యంగా ఉంచుతామని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని కోరారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్ తాసీల్దార్ ఘాన్సీరాం, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్..

ఈనెల 9, 10 తేదీల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. శని, ఆదివారాల్లో జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ఫారాలు బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట టౌన్, నవంబర్ 8 : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఈ నెల 9, 10వ తేదీల్లో క్యాంపెయిన్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఓటర్ నమోదు, అభ్యంతరాలు, మార్పులు చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంపెయిన్‌లో భాగంగా బూత్ లెవల్ అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. కొత్త ఓటర్లు ఫారం-6, అక్టోబర్ 29న విడుదల చేసిన ముసాయిదాలో అభ్యంతరాల కోసం ఫారం-7, సవరణల కోసం ఫారం-8లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 28 వరకు అప్లై చేసుకోవచ్చన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులు విజయ దుందుభి

జడ్చర్ల, నవంబర్ 8 : శ్రీచైతన్య విద్యాసంస్థలు విజయ పరంపరలో మరో మైలురాయిని దాటాయని పాఠశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి అన్నారు. శ్రీచైతన్య పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్‌రికార్డు ఈవెంట్‌లో దేశంలోని 20 రాష్ట్రాల నుంచి 10వేల మంది విద్యార్థులు పాల్గొని 3గంటల్లో 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠించి ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. ఈ ఈవెంట్లో ఘనత సాధించింది మూడు నుంచి పదేండ్లలోపు విద్యార్థులే కావడం గర్వకారణమన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

సమగ్రంగా కుటుంబ సర్వే

జడ్చర్ల, నవంబర్ 8 : గ్రామాల్లో చేపట్టిన కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా సమగ్రంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయకుమార్, అధికారులకు కుటుంబ సర్వేపై అవగాహన కల్పించారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

మాగనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలమ్

మాగనూరు, నవంబర్ 8 : వరి కొనుగోలులో రైతులకు ఇబ్బందులు రానీయొద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలమ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు టోకెన్లు, గన్నీ బ్యాగుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

కేంద్రంలోనే పత్తి విక్రయించాలి

నారాయణపేట టౌన్, నవంబర్ 8 : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పత్తిని విక్రయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి తెలిపారు. అప్పంపల్లి వద్ద మారుతి కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పత్తిని ఆరబెట్టి తీసుకురావాలని రైతులను కోరారు. అన్నదాతలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సీసీఐ సిబ్బందికి సూచించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దేవరకద్ర, నవంబర్ 8 : మండలంలోని బస్వాయిపల్లిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ హన్మంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌తో బాధితులకు న్యాయం

రక్తదానం చేస్తున్న జిల్లా జడ్జి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్, నవంబర్ 8 : లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కోర్టులో న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా పీవీ నరసింహరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి హాజరై మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాధితులను గుర్తించి వారికి న్యాయ సహాయాన్ని అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారాలీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్ల బాధ్యతలను వివరించారు. అనంతరం జిల్లా జడ్జితోపాటు పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి శారదాదేవి, మూడో అదనపు జిల్లా జడ్జి శ్రీదేవి, జిల్లా కార్యదర్శి ఇందిర, ప్రిన్సిపాల్, సీనియర్ సివిల్ జడ్జి రాధిక, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు సుధా కిరణ్, టెక్నిషియన్స్ కల్పన సంతోష్, రఘుపతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవలపై అవగాహన ఉండాలి

నారాయణపేట, నవంబర్ 8 : లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలపై అవగాహన ఉండాలని లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి వింద్యానాయక్ తెలిపారు. శుక్రవారం జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రై వేట్ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయసేవా సంస్థ ఆ ధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన శిబిరాల్లో ఇంటింటి ప్రచారాలు, న్యాయ పరమైన, మొబైల్ వ్యాన్‌లు, న్యాయసాయం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ లక్ష్మీపతిగౌడ్, నాగేశ్వరి, ఏజీపీ భీంరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువులతోపాటు క్రీడల్లో రాణించాలి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు, నవంబర్ 8 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఈ నెల 5న ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిహారిక లాంగ్‌జంప్‌లో మొదటిస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి విద్యార్థిని అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం మాగనూరు మండలం కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి బోరు ప్రారంభించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇంటింటి సర్వే ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహారెడ్డి, పీడీ రాకేశ్‌శర్మ పాల్గొన్నారు.

వీల్‌చైర్లు వితరణ

మహబూబ్‌నగర్, నవంబర్ 8 : ప్రభుత్వ జనరల్ దవాఖానకు 18 వీల్ చైర్లు వితరణ చేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశాల మేరకు వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారు వీల్ చైర్లను వితరణ చేశారు. అదేవిధంగా జీఎంఆర్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధి మల్లారెడ్డి దవాఖాన కాన్ఫరెన్స్ హాల్‌కు ఆఫీసర్స్ చైర్, 40 నార్మల్ చైర్లను అందజేశారన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

బహుమతులు అందుకుంటున్న వరుణ్, అఖిల్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 8 : జాతీయస్థాయి యోగా పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి అన్నారు. వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో వరుణ్‌తేజ్ ప్రథమ బహుమతి అందుకోగా, అఖిల్ ద్వితీయ బహుమతి సాధించాడు. వీరిని జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు..

ఊట్కూర్, నవంబర్ 8 : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి క్రిష్‌నాయక్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కుసుమ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. ఈనెల 10 నుంచి 12 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ సాయినాథ్ పాల్గొన్నారు.

జాజాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు..

నారాయణపేట రూరల్, నవంబర్ 8 : జిల్లాస్థాయి పోటీలకు మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో రేవంత్, హర్షవర్ధన్, కిరణ్.., బాలికల విభాగంలో త్రివేణి, భవాని, నందిని, సంధ్య సత్తాచాటి జిల్లా స్థాయికి సెలక్ట్ అయ్యారు. అలాగే రెజ్లింగ్‌లో ఆదిత్య రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జీహెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్, మంగళ, భానుప్రకాశ్, ప్రతాప్, నర్సింహ, శశిరేఖ, శిరీష, శ్రీదేవి, నిర్మల, రామేశ్వర్‌రెడ్డి, వెంకటప్ప అభినందించారు.

రెజ్లింగ్ పోటీలకు బయలుదేరిన విద్యార్థులు

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్, నవంబర్ 8 : 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర రెజ్లింగ్ పోటీలకు గురువారం ఉమ్మడి జిల్లా విద్యార్థులు హైదరాబాద్ బయలుదేరివెళ్లారు. ఈ సందర్భంగా డీఈవో అబ్దుల్‌ఘని మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభకనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, ఏఎంవో విద్యాసాగర్, జీసీడీవో పద్మనళిని, ఉదయభాను, పీడీలు, పీఈటీలు విద్యార్థులను అభినందించారు.

ఎన్ఎస్ఎస్ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వీసీ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్

ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం

- పీయూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 8 : జాతీయ సేవా పథకంతో విద్యార్థులలో సేవాభావం అలవడుతుందని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్ అన్నారు. ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించనున్న ఓరియంటేషన్ ప్రోగ్రాం బ్రోచర్లను శుక్రవారం పీయూ పరిపాలన భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు వలంటీర్లు చురుకైన పాత్ర వహించాలన్నారు. ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్, చంద్రకిరణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, అర్జున్‌కుమార్, ఈశ్వర్, చిన్నాదేవి, వెంకటరాఘవేందర్, జ్ఞానేశ్వర్, గాలన్న తదితరులు పాల్గొన్నారు.

ఐక్యూఏసీ డైరెక్టర్‌గా నూర్జహాన్..

ఐక్యూఏసీ డైరెక్టర్‌గా రసాయనశాస్త్ర విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్‌ను నియమిస్తూ పీయూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబ్‌పేట, నవంబర్ 8 : మండలంలోని కారుకొండ, తీగల్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

12న బీసీ సదస్సు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 8 : జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఆధ్వర్యంలో బీసీ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 12న మహబూబ్‌నగర్‌లోని గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా బీసీల సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ తెలిపారు.

జిల్లా కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం

- జడ్చర్ల నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్

మమబూబ్‌నగర్, నవంబర్ 8 : ఓ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీలో షార్ట్‌సర్క్యూట్‌తో కార్యాలయం కాలిపోయిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి చోట్టుచేసుకున్నదని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని పద్మావతికాలని కమాన్ సమీపంలోని శ్రీ నిలయం భవనంలో సెకండ్‌ఫ్లోర్‌లో ఎల్‌వేట్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. అయితే శుక్రవారం రాత్రి కార్యాలయం మూసి అందరూ తమ విధులు ముగించుకొని ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో కార్యాలయంలోని ఇన్‌వర్టర్ వద్ద షార్ట్‌షర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించి ఒక్కసారిగా పెద్దగా మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే యాజమాన్యానికి సూచించారు. వారు మంటలు ఆర్పేందుకు ఫైర్‌ఇంజిన్‌కు ఫోన్ చేస్తే మహబూబ్‌నగర్‌లో అందుబాటులో లేక జడ్చర్ల నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చే లోపే యాజమాన్యం మంటలను ఆర్పేందుకు యత్నించారు. జడ్చర్ల నుంచి రావడం ఆలస్యం కావడంతో మంటలు పెద్దగా వ్యాపించాయి. మంటల్లో కంపెనీలోని కంప్యూటర్లు, ఏసీ, ఇతర విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.

రైతులపై తేనెటీగల దాడి

ధన్వాడ, నవంబర్ 8 : రైతులపై తేనెటీగలు దాడి చేసిన ఘటన మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. కంసాన్‌పల్లికి చెందిన కుర్వ రాములు పొలంలో మిషన్‌తో వరి కోస్తుండగా.. మిషన్ చెట్టుకు తగిలింది. దీంతో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా రైతులు రాములు, ఆనంద్, మల్లేశ్, వెంకటేశ్‌పై దాడి చేశాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

విగ్రహదిమ్మెను పునఃప్రతిష్ఠించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 8 : మొల్లమాంబ విగ్రహదిమ్మెను పునఃప్రతిష్ఠించాలని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని హాలియా మండలంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతితో దిమ్మె నిర్మాణం చేపట్టగా, మున్సిపల్ శాఖ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలిగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, ఆంజనేయలు, నర్సప్ప, రవికుమార్, నాగప్ప పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

దామరగిద్ద, నవంబర్ 8 : హద్దులు మీరి హామీల మత్తులో ప్రజలను తప్పుదోవ పట్టించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆంజనేయులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీ చేయకుంటే ప్రజల పక్షాన ఉద్యమం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కృష్ణ, నవంబర్ 8 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కృష్ణ మండలంలోని గుడెబల్లూర్‌లో గల సత్యసాయి వాటర్ పంప్ వద్ద చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుపై తిరుగుతుండేవాడని, శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు